సాక్షి
పల్నాడు

బుధవారం । 26 । మార్చి । 2025



వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

దుగ్గిరాల: శ్రవణానక్షత్రం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం దుగ్గిరాల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ఘనంగా జరిగింది.



అమరావతిలో జపాన్ బృందం

అమరావతి: ప్రముఖ పర్యాటక కేంద్రం అమరావతిని మంగళవారం జపాన్ ప్రతినిధుల బృందం సందర్శించింది. వారివెంట ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బాపట్ల: బాపట్ల పట్టణం పాతబస్టాండ్‌లోని శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. శాంతి కల్యాణ మహోత్సవం చేపట్టారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
నరసరావుపేట	6.27	4.53
గుంటూరు	6.25	4.51
బాపట్ల	6.25	4.51

చేతి కందింది నోటి కందేలా లేదు!

కంది రైతుకు 'మద్దతు' ఇవ్వని సర్కారు



పొలం వద్ద ఆరబెట్టిన కందులు

- కంది పంటను అమ్ముకోవడానికి ఇబ్బందిపడుతున్న రైతులు
- జిల్లాలో 26,908 హెక్టార్లలో 50,879 మెట్రిక్ టన్నుల దిగుమతి వస్తుందని వ్యవసాయశాఖ అంచనాలు
- మార్క్‌ఫెడ్ ద్వారా తూతూమంత్రంగా కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం
- కొనుగోలు కేంద్రాల్లో తేమ, తాలు పేరుతో కందులను కొనడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్న కర్షకులు
- రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని తక్కువ ధరకే అడుగుతున్న దాల్ మిల్లర్లు
- ధరలు పతనమయ్యాంటూ రూ.6 వేలకు మించి కొనుగోలు చేయని వైనం
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో మద్దతు ధర రూ.7,550 కూడా దక్కని దుస్థితి
- వైఎస్సార్ సీపీ హయాంలో ఇబ్బంది లేకుండా రూ.10వేలకు కందులు అమ్ముకున్నామంటున్న రైతులు

సాక్షి, నరసరావుపేట: కంది కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన పంటను కొంటామని కూటమి ప్రభుత్వం చెప్పిన మాటలన్నీ వట్టి మూటలుగానే మారాయి. మార్క్‌ఫెడ్, నాఫెడ్‌ల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో తూతూమంత్రంగా కందులను కొనుగోలు చేసి చేతులు దులుపుకొంటున్నారు. రకరకాల కారణాలు చెప్పి రైతుల నుంచి కంది కొనుగోలుకు నిబంధనల బంధనాలు వేస్తున్నారు. దీంతో కంది పంట సాగు చేసిన రైతన్న పరిస్థితి దయనీయంగా ఉంది. పండిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయక ఒకవైపు.. కంది మిల్లుల యజమానులు సిండికేట్‌గా మారి దోచుకోవడంతో మరోవైపు కంది రైతు విలవిలలాడుతున్నాడు.

తేమ శాతం పేరుతో...

మద్దతు ధర రూ.7,550కు ప్రతి రైతు నుంచి సమీపంలో ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్, నాఫెడ్‌ల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం, అధికారులు ప్రకటనలు చేశారు. ఇప్పటివరకు సుమారు 1200 మంది రైతుల నుంచి 12,200 మెట్రిక్ టన్నుల కందులను కొనుగోలు చేసినట్టు జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. అయితే ఖరీఫ్‌తో పాటు రబీ కంది కూడా అందుబాటులోకి రావడంతో ప్రభుత్వం కొనుగోలు చేసిన కంది చాలా తక్కువ. మరోవైపు తేమశాతం, తాలు పేరిట రైతుల నుంచి కందుల కొనుగోలులో మార్క్‌ఫెడ్ ప్రతిబంధకాలు సృష్టిస్తోంది. కల్లాల వద్ద రైతులు శ్రమ పడి అధికారులు చెప్పిన విధంగా తయారు చేసినా.. కొనుగోలు జరగని దుస్థితి నెలకొంది. అధికారులు చెబుతున్న ప్రకారం చేయడం వల్ల తమకు క్వింటాకు 5 నుంచి 10 కిలోల తరుగుదల కనిపిస్తోందని, ఇప్పటికే మద్దతు ధరలేక ఇబ్బందిపడుతుంటే ఇది మరింత నష్టం కలిగిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న కందుల మిల్లుల యజమానులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి దోచుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. ధరలు పతనమయ్యాయన్న పేరుతో క్వింటా కందులను రూ.6,000–రూ.6,200 మధ్య మాత్రమే కొంటున్నారు.

వారు చెప్పిందే ధర..!



వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 26,908 హెక్టార్లలో కంది పంట సాగుచేయగా సుమారు 50,879 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే దిగుబడి ఊహించిన దానికన్నా అధికంగా ఉంది. రైతులకు ఈ–క్రాప్ బుకింగ్‌పై అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలమవ్వడంతో కంది సాగు తక్కువగా ఉంది. మరోవైపు ఈ–క్రాప్ చేయని రైతుల నుంచి కందులు కొనుగోలు చేయబోమని కొనుగోలు కేంద్రాలు తేల్చిచెబుతున్నాయి. దీంతో తప్పనిసరి ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో వారు చెప్పిందే ధరగా మారింది.

వైఎస్సార్ సీపీ హయాంలో రూ.12 వేల వరకు...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో క్వింటా కందులు రూ.10వేలకు పైగా ధర పలికింది. కొంతమంది రైతులు రూ.12 వేలకు సైతం అమ్ముకున్నారు. దీంతో ఈ ఏడాది పల్నాడులోని మెట్ట ప్రాంతాల్లో కంది పంట సాగుకు రైతులు ఉత్సాహం చూపారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ ఏడాది రూ.7,550 మాత్రమే మద్దతు ధర ప్రకటించింది. తీవ్ర వాతావరణ అనుకూలతలు, చీడపీడల మధ్య పండిన అరకొర పంటను ఆ ధరకైనా అమ్ముకుందామన్న రైతులకు తీవ్ర నిరాశే ఎదురవుతోంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రైతులకు ఇవ్వాల్సిన అన్నదాత సుఖీభవ లాంటి పథకాల ద్వారా ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా కనీసం పండినపంటను సైతం అమ్ముకోలేని దుస్థితికి తెచ్చారని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందాల్సిన సాయం సక్రమంగా అందడంతోపాటు దిగుబడులను దళారుల దోపిడీ లేకుండా అమ్ముకున్నామని వారు చెబుతున్నారు.

తేమ శాతం సాకుతో కొనడం లేదు



ప్రభుత్వం కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి కొనుగోలు చేయకపోవడంతో ఖరీఫ్‌లో పండిన కందిని క్వింటాలు రూ.6వేలకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం రబీ సీజన్లో కంది పంట చేతికి వస్తున్నా ప్రభుత్వం కేంద్రాల ద్వారా కొనుగోలు చేయకపోవడంతో ఇళ్లలోనే నిల్వ చేసుకుంటున్నాం. కందులు కొనుగోలు చేయాలని స్థానిక వ్యవసాయ సిబ్బందిని అడిగితే తేమశాతం ఎక్కువగా ఉందని, రకరకాల కారణాలు చెప్పి కొనుగోలు చేయడం లేదు. ఇటువంటి దుస్థితి ఎప్పుడు లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నేరుగా కల్లం వద్దకు వచ్చి రూ.10వేలు పైగా చెల్లించి అధికారులు కొనుగోలు చేశారు. అప్పుడు లేని సాకులు ఈరోజు చెప్పడం ఏంటో అర్థం కావడం లేదు. మద్దతు ధర రూ.7,550లకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– అడపాల అంబారావు,
కంది రైతు, ఆత్మకూరు గ్రామం, దుర్గి మండలం

పెట్టుబడి కూడా కష్టం



నాలుగు ఎకరాల్లో కంది సాగుచేస్తే దిగుబడి సుమారు 25 క్వింటాళ్లు వచ్చింది. కోతల తరువాత నాలుగు రోజులు కల్లంలో ఎండబెట్టాను. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమ, తాలు పేరుతో సాకులు చెబుతున్నారని జల్లెడ సైతం పట్టి సిద్ధంగా ఉన్నాం. పంట అమ్ముకుందామంటే కొనేవారు ముందుకు రావడం లేదు. ఈ సంవత్సరం దిగుబడి కూడా బాగా తగ్గింది. గత సంవత్సరం క్వింటా కంది రూ.10 వేలకు పైగా ధర పలకడంతో ఎన్నో ఆశలతో ఈ సంవత్సరం నాలుగు ఎకరాల్లో సాగు చేశాను. ఇప్పటికైనా ప్రభుత్వం మద్దతు ధర రూ.7,550లకు కంది కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి.

– మిరియాల కొండలు,
కంది రైతు, ఒప్పిచర్ల, కారంపూడి మండలం

న్యూస్‌రీల్

గణనీయంగా పెరిగిన మల్లేశ్వరుడి ఆదాయం

109 రోజుల హుండీ కానుకల ఆదాయం రూ.58.03లక్షలు



పెదకాకాని: శివాలయం మల్లేశ్వరస్వామి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో మంగళవారం హుండీల్లోని కానుకలు లెక్కించారు. పర్యవేక్షణాధికారిగా కాజ గ్రూపు టెంపుల్స్ ఈఓ పుణ్యాల వెంకటరెడ్డి హాజరయ్యారు. 109 రోజులకు హుండీ కానుకల ద్వారా రూ.58,03,497లు ఆదాయం లభించినట్లు తెలిపారు. అలాగే అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.2,89,270లు సమకూరిందన్నారు. హుండీల ద్వారా బంగారం 54.300 గ్రాములు, వెండి 438 గ్రాములు, ఆస్ట్రేలియా 20 డాలర్లు, యుఎస్ఏ 139 డాలర్లు, ఇంగ్లాండ్ 10 పౌండ్లు, నేపాల్ కరెన్సీ రూ.130 , ఇండోనేషియా రూ.5000 వచ్చాయని డీసీ తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేష పూజలు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో మంగళవారం సుబ్రహ్మణ్యస్వామికి విశేషపూజలు నిర్వహించారు. స్వామివారికి భక్తుల సమక్షంలో అర్చకుడు శంకరమంచి రాజేష్ శర్మ మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమరేశ్వరుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పలుగ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

శాంతి భద్రతల సమావేశానికి కలెక్టర్, ఎస్పీ హాజరు



నరసరావుపేట: రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం నిర్వహించిన శాంతిభద్రతల సమావేశానికి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు హాజరయ్యారు. పలు అంశాలపై సమావేశంలో చర్చించారు.

ముగ్గురు వీఆర్‌ఓలకు షోకాజ్ నోటీసులు

మాచవరం: మాచవరం మండలంలో ముగ్గురు వీఆర్‌ఓలకు ఆర్డీఓ మురళీ కృష్ణ షోకాజ్ నోటీసులను జారీ చేసినట్లు తహసీల్దార్ ఎన్. నాగమల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. మల్లవోలు, పిల్లుట్ల, తురకపాలెం వీఆర్‌ఓలు ఏసుపాదం, లోకేష్, జానీబాషాలు ఐవీఆర్ కాల్స్‌లో పట్టాదారు పాస్ పుస్తకాల జారీ విషయంలో తమ వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారని మూడు గ్రామాలకు చెందిన కొంత మంది రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ముగ్గురు వీఆర్‌ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు.

ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన వాయిదా

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మార్చి 27 నుంచి 29వ తేదీవరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శనను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేయటం జరిగిందని విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని ఎప్పుడు నిర్వహిస్తారనే విషయాన్ని త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

మొబైల్ వ్యాపారి దివాలా

- దుకాణం మూసివేసి కుటుంబంతో పరారీ
- సుమారు రూ.8కోట్ల మేర అప్పులు
- ఆందోళనలో రుణదాతలు

నరసరావుపేట టౌన్: పట్టణంలో ప్రముఖ మొబైల్ వ్యాపారి దివాలా తీయడం చర్చనీయాంశంగా మారింది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో గత కొన్ని నెలలుగా వ్యాపారులు వరుసగా ఐపీలు పెడుతున్న విషయం తెలిసిందే. సాయిసాధన చిట్‌ఫండ్ స్కాం ఉదంతం మరువకముందే ధాన్యం వ్యాపారి ఐపీ పెట్టాడు. ఈ రెండు ఘటనలతో బెంబేలెత్తుతున్న వ్యాపారులకు మొబైల్ దుకాణ యజమాని రాత్రికిరాత్రే కుటుంబంతో ఉడాయించడం కలవరపాటుకు గురిచేస్తుంది. ఆర్డీఓ కార్యాలయ సెంటర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా వ్యాపారి నమ్మకంగా మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. పట్టణంలోని పలు వ్యాపారులు, చీటీపాటల నిర్వాహకుల వద్ద నుంచి ఈయన పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నాడు. దీంతో పాటు కొన్ని ప్రముఖ బ్యాంకుల్లో రుణాలు పొందాడు. రుణదాతల నుంచి ఒత్తిడి రావడంతో రెండు రోజుల క్రితం దుకాణానికి తాళాలు వేసి వెళ్లిపోయాడు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో రుణదాతలు రామిరెడ్డిపేటలోని ఇంటి వద్దకు వెళ్లారు. రాత్రికి రాత్రే సామాన్లతో ఉడాయించినట్టు తెలుసుకొని ఆందోళన చెందుతున్నారు. సుమారు రూ.8కోట్ల వరకు అప్పు ఉన్నట్టు సమాచారం.

సొంత రాజ్యాంగం 'పులి'మేసి!

- మున్సిపల్ చట్టాలకు తూట్లు
- కమిషనర్ పులి శ్రీనివాసులు తీరుపై వైఎస్సార్ సీపీ ధ్వజం
- మేయర్ రాజీనామా ఆమోదంపై కౌన్సిల్ నిర్వహణ!
- అసలు రాజీనామా ఫార్మేటే సరికాదు
- వైఎస్సార్ సీపీ సభ్యుల వాకౌట్
- మెజార్టీ సభ్యుల ఆమోదంతో మేయర్ రాజీనామా ఆమోదం



కౌన్సిల్ నుంచి వాకౌట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ సభ్యులు

నెహ్రూనగర్ (గుంటూరుఈస్ట్) : గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు రాజీనామాపై మున్సిపల్ చట్టాలను కాదని కమిషనర్ తన సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు) దుయ్యబట్టారు. ఈ నెల 15న నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు తన పదవికి రాజీనామా చేసి కలెక్టర్‌కు పంపిన విషయం తెలిసిందే. మేయర్ రాజీ నామా ఆమోదం కోసం మంగళవారం కౌన్సిల్ హాల్‌లో అత్యవసర కౌన్సిల్ సమావేశం జరిగింది. తాత్కాలిక మేయర్‌గా షేక్ సజీల మేయర్ రాజీనామా ఆమోదానికి సభ్యుల అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. వెంటనే డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ మేయర్ రాజీనామా లేఖను కలెక్టర్‌కు పంపితే.. ఆ లేఖ ఆధారంగా కౌన్సిల్ ఏ విధంగా నిర్వహిస్తారు? అసలు కలెక్టర్ నగర పాలక సంస్థకు మేయర్ రాజీనామాపై ఏమని రాశారో చెప్పాలని సెక్రటరీని కోరారు.

మౌనం వహించిన సెక్రటరీ

దీనిపై కౌన్సిల్ సెక్రటరీ మౌనం వహించారు. దీంతో వెంటనే కమిషనర్ అందుకుని సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. ఈ నెల 15న మేయర్ పదవికి కావటి మనోహర్ రాజీనామా చేస్తూ లేఖను మెయిల్ ద్వారా కలెక్టర్‌కు, కమిషనర్‌కు పంపారని, దీనిపై నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారని కమిషనర్ వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మేయర్ రాజీనామాపై అత్యవసర కౌన్సిల్ నిర్వహణకు ఉన్న ఇద్దరు డెప్యూటీ మేయర్లలో ఒకరిని మేయర్‌గా ఎంపిక చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ నెల 17న మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి, ఎంఏయూడీ శాఖకు లేఖ రాశామని, ఈ నెల 21న డెప్యూటీ మేయర్ షేక్ సజీలను తాత్కాలిక మేయర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. దీని ప్రకారం సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

మేయర్ రాజీనామా ఫార్మేట్ సరైనది కాదు

మున్సిపల్ చట్టం 92 (1) మేయర్ తన పదవికి రాజీనామా చేయాలంటే కౌన్సిల్ నిర్వహించి కౌన్సిల్‌లో రాజీనామాకు గల కారణాలను చర్చించిన తరువాత సభ్యుల ఆమోదంతో రాజీనామాను ఆమోదించాలి. లేదా కౌన్సిల్ సెక్రటరీకి రాజీనామాను పంపితే ఆ రాజీనామాకు అనుగుణంగా సెక్రటరీ అత్యవసర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి ఆ తరువాత రాజీనామాను ఆమోదించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ నగర కమిషనర్ కలెక్టర్‌కు పంపిన రాజీనామాను ఆధారం చేసుకుని కమిషనర్ తన సొంత రాజ్యాంగాన్ని అమలు చేసి ప్రభుత్వానికి లేఖ రాయడమేమిటని డెప్యూటీ మేయర్ వజ్రబాబు ప్రశ్నించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, దీనిపై తాము లీగల్ ఓపీనియన్ తీసుకుంటామని..అప్పటివరకు కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయాలని కోరుతూ కౌన్సిల్ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం సభ నుంచి వైఎస్సార్ సీపీ సభ్యులు వాకౌట్ చేశారు. ఆ తరువాత తాత్కాలిక మేయర్ షేక్ సజీల మెజార్టీ సభ్యుల ఆమోదంతో మేయర్ కావటి మనోహర్ రాజీనామాను ఆమోదించారు.

సీఐ 'గన్' కార్యం..!

ఫిరంగిపురంలో ఓవర్ యాక్షన్

- అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెచ్చిపోతున్న ఖాకీలు
- అధికార పార్టీకి కొమ్ముకాసి వీఆర్ బాట పడుతున్న వైనం
- సివిల్ పంచాయితీలలో తలదూర్చి శాఖకు చెడ్డపేరు
- రేంజ్ పరిధిలో అడ్డగోలు బదిలీలు, వీఆర్‌లు
- పది నెలల్లో ఒకే స్టేషన్‌కు ముగ్గురు సీఐలు
- కూటమి సర్కారు వచ్చాక ఎల్లో ఫైరవీలదే రాజ్యం



సాక్షి ప్రతినిధి, గుంటూరు, నగరంపాలెం (గుంటూరు వెస్ట్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్టీ నాయకులను పట్టుకుని పోస్టింగ్‌లు తెచ్చుకున్న సీఐలు కొందరు స్వామిభక్తిని ప్రదర్శిస్తూ ఓవర్ యాక్షన్ చేస్తున్నారు. మరికొందరు అడ్డంగా దొరికిపోయి వీఆర్ బాట పడుతున్నారు. తాజాగా ఫిరంగిపురంలో సీఐ రవీంద్రబాబు వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. స్థల వివాదంలో ఫిర్యాదు చేసిన వారిపైనే దాడికి తెగబడటం, వారికి సినీఫక్కీలో గన్ గురిపెట్టడం, ఒక యువకుడిని గన్‌తో కొట్టి గాయపరచడం జిల్లాలో సంచలనం రేకెత్తించాయి. ఈ అధికారి సివిల్ పంచాయితీలో తలదూర్చి రెచ్చిపోవడం ఇది రెండోసారి.

గతంలో గోడను పడగొట్టించిమరీ..!

గతంలో పొనుగుపాడు గ్రామంలో దళితులకు సంబంధించిన స్థలంలో గోడను పడగొట్టించి మరీ ఈ సీఐ రోడ్డు వేయించిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకుని గ్రామానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డైమండ్‌బాబుపై కూడా తప్పుడు కేసు నమోదు చేశారు. ఇప్పుడు ఏకంగా గ్రామస్తుల చేతిలో తన్నులు తినే పరిస్థితి తెచ్చుకున్నారు. ఈ అధికారిని వెనకేసుకొస్తారా, లేక చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

25 మంది వీఆర్‌లో..

ప్రస్తుతం రేంజ్‌లో సుమారు 25 మందికి పైగా సీఐలు వీఆర్‌లో ఉన్నారు. వీరంతా కూడా కూటమి అధికారంలోకి వచ్చాక వీఆర్‌కు వెళ్లిన వారే. సీఐల పోస్టింగులలో అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన సామాజిక వర్గానికి పెద్దపీట వేశారు. మిగిలిన వారిని వీఆర్‌కు పిలవడం లేకపోతే ప్రాధాన్యం లేని పోస్టింగ్‌లు కట్టబెట్టడం చేస్తున్నారు. లూప్‌లైన్ పోస్టింగ్‌లు ఇచ్చినా చిన్నచిన్న కారణాలతోనే వారిని పక్కన పెట్టారు.

బూట్లతో డెప్యూటీ సీఎం వద్దకు వెళ్లారని వీఆర్‌కు..

జనసేన కార్యాలయంలో డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దీక్షలో ఉండగా బూట్లతో లోపలికి వెళ్లారంటూ మంగళగిరి పట్టణ సీఐ ఎం.శ్రీనివాసరావును వీఆర్‌కు పంపడం కూటమి ప్రభుత్వ విధానాలకు పరాకాష్టగా నిలిచింది. కొన్ని స్టేషన్లకు సీఐగా వస్తే ఎన్ని రోజులు ఉంటారో తెలియని పరిస్థితి ఉంది.

ఈ 'రేంజ్' వేరు..!

సీఐల బదిలీలు, వీఆర్ విషయంలో గుంటూరు రేంజ్ కొత్త ట్రాక్ రికార్డును నెలకొల్పింది. గుంటూరు రేంజ్ డీఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠీ వచ్చిన తర్వాత పలువురు సీఐలను బంతాట ఆడుతున్నారు. సరిగ్గా పది నెలలు క్రితం సుమారు 13 మందికిపైగా సీఐలను పోలీస్‌స్టేషన్ల (పీఎస్)కు బదిలీ చేశారు. అయితే వీరు బాధ్యతలు స్వీకరించక ముందే వెనక్కి పిలిచారు. కొందరు సీఐలు బాధ్యతలు చేపట్టిన రోజుల వ్యవధిల్లోనే వెయిటింగ్, వేకెన్సీ రిజర్వ్ (వీఆర్) లోకి వెళ్తున్నారు. కొంతమందికి పోస్టింగ్ ఇవ్వగానే కూటమికి చెందిన పచ్చపత్రికల్లో, సోషల్ మీడియాలో ట్రోలింగ్ మొదలవుతోంది. గత ప్రభుత్వానికి అంటకాగారని, వారికి పోస్టింగ్ ఇవ్వడమేమిటంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు వస్తాయి. వెంటనే వారిని వీఆర్‌కు పిలుస్తున్నారు. ఇలా వెళ్లిన వారికి నెలలు గడిచినా పోస్టింగ్‌లు ఉండటం లేదు.

పట్టాభిపురంలో ఇప్పటికి నలుగురు సీఐలు మారారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పట్టాభిపురం స్టేషన్‌కు సీఐగా కిరణ్ వచ్చారు. అతను ఎమ్మెల్యే భర్త ఆదేశాల మేరకు వేరే వారిపై ఎస్సీ,ఎస్టీ కేసు పెట్టడంతో అతనిని వీఆర్‌కు పంపారు. తర్వాత వీరేంద్రబాబు వచ్చీరాగానే సివిల్ పంచాయితీలలో వేలుపెట్టారు. విపక్ష నాయకులే టార్గెట్‌గా కేసులు పెట్టి వేధింపులకు దిగారు. అయితే అతన్ని కూడా వీఆర్‌కు పంపించి మధుసూదన్‌కు డీవో ఇచ్చారు. అతను విధుల్లో చేరిన 24 గంటల్లోనే పోస్టింగ్ నిలిపేసి గాల్లో పెట్టారు. అరండల్‌పేట స్టేషన్‌కు కూడా ఇద్దరు సీఐలు మారారు. మొదట కుంకా శ్రీనివాసరావును తీసుకురాగా బోరుగడ్డ అనీల్ కేసులో వీఆర్‌కు పంపించి వీరాస్వామిని తీసుకువచ్చారు. నగరంపాలెం స్టేషన్‌కు మొదట మధుసూదనరావును తీసుకురాగా తర్వాత నాయక్, ప్రస్తుతం నజీర్‌బేగ్‌ను తీసుకొచ్చారు.

- తాజాగా రెండు రోజుల క్రితమే అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్‌పై వేటు పడింది. గ్రంధశిరి గ్రామంలో జరిగిన వివాదంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ఒక నిందితుడు తప్పించుకుపోయేలా వ్యవహరించిన అంశంలో వీఆర్‌కు పిలిచారు. ఇలా రేంజ్ పరిధిలో మారిన వారి సంఖ్య చాలా ఉంది. ఈ మూడు ముక్కలాటపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఉప ఎన్నికలకు ప్రిసైడింగ్ అధికారుల నియామకం



ప్రిసైడింగ్ అధికారులతో సమావేశమైన జెడ్పీ సీఈఓ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో తొమ్మిది మండల ప్రజా పరిషత్‌లకు సంబంధించిన అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో–ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఉప ఎన్నికల నిర్వహణపై జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. జెడ్పీలోని తన ఛాంబర్లో సమావేశాన్ని నిర్వహించిన సీఈవో జ్యోతిబసు ఈనెల 27న ఆయా మండలాల పరిధిలో మండల పరిషత్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటుచేసి, అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో–ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకునే విధానంపై అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల సన్నాహక ప్రక్రియలో భాగంగా సంబంధిత ప్రిసైడింగ్ అధికారులతో పాటు మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి పిట్టలవానిపాలెం, భట్టిప్రోలు, దుగ్గిరాల, గుంటూరు రూరల్, తెనాలి, అచ్చంపేట, కారంపూడి, నరసరావుపేట, ముప్పాళ్ల ఎంపీడీవోలతోపాటు ఎన్నికల నిర్వహణకు సంబంధిత జిల్లా కలెక్టర్లచే నియమించబడిన ప్రిసైడింగ్ అధికారులు హాజరయ్యారు. బాపట్ల మండలం పిట్టలవానిపాలెం మండల అధ్యక్ష ఎన్నికకు బాపట్ల డీఎల్‌డీవో సీహెచ్ విజయలక్ష్మి, భట్టిప్రోలు కో–ఆప్టెడ్ సభ్యుని ఎన్నికకు బాపట్ల డీఏహెచ్‌వో డాక్టర్ బి. వేణుగోపాలరావు, దుగ్గిరాల మండల అధ్యక్ష ఎన్నికకు గుంటూరు డ్వామా పీడీ వి. శంకర్, గుంటూరు రూరల్ ఉపాధ్యక్ష ఎన్నికకు ఏపీఎంఐపీ పీడీ ఎల్. వజ్రశ్రీ, తెనాలి కో–ఆప్టెడ్ సభ్యుని ఎన్నికకు హ్యాండ్లూమ్స్ ఏడీ బి. ఉదయ కుమార్, అచ్చంపేట మండల అధ్యక్ష ఎన్నికకు క్రోసూరు వ్యవసాయశాఖ ఏడీ వి. హనుమంతరావు, కారంపూడి ఉపాధ్యక్ష ఎన్నికకు పల్నాడు డ్వామా పీడీ ఎస్. లింగమూర్తి, నరసరావుపేట ఉపాధ్యక్ష ఎన్నికకు పల్నాడు డీఏఓ ఐ.మురళి, ముప్పాళ్ల కో–ఆప్టెడ్ సభ్యుని ఎన్నికకు పల్నాడు డీఏహెచ్‌వో కె. కాంతారావు ప్రిసైడింగ్ అధికారులుగా నియమితులయ్యారు. సమావేశంలో గురజాల డీఎల్‌డీవో గబ్రూ నాయక్, పెదకాకాని ఈవోపీఆర్డీ కె. శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు.

క్లుప్తంగా

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 6,041 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా సుబ్బారెడ్డి



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా పట్టణానికి చెందిన వై.వి.సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. విజయవాడలో ఈనెల 23వ తేదీన అసోసియేషన్ సమావేశంలో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికల్లో సుబ్బారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ 4 సంవత్సరాల పాటు సేవలు అందించనుంది. పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా సేవలు అందిస్తున్న సుబ్బారెడ్డి రాష్ట్ర అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నిక కావటంపై జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి, కోశాధికారి వై.వి.శ్రీనివాసరెడ్డి, సభ్యులు అభినందనలు తెలిపారు.

బీసీలకు డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

జిల్లా బీసీ సంక్షేమ అధికారి శివనాగేశ్వరరావు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలోని బీసీ, ఈబీసీ కులాలకు చెందిన అర్హులైన అభ్యర్థులకు డీఎస్సీ–2025 పరీక్షలకు ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి బి.శివనాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 29వ తేదీ సాయంత్రం 5గంటల లోగా ప్రకాష్‌నగర్ తిలక్ స్కూల్‌రోడ్డులోని తమ కార్యాలయంలో అందచేయాలని కోరారు. ఆన్‌లైన్ ఉచిత శిక్షణకు టెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. టీటీసీలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారని వివరించారు. అభ్యర్థులు తమ దరఖాస్తుతో 10వ తరగతి, టీటీసీ, టెట్ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేయాలని తెలిపారు. వివరాలకు 9441630075 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డుకు మంగళవారం 487 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 373 బస్తాలు రాగా, వాటి కనిష్ట ధర రూ.10,500, గరిష్ట ధర రూ.11,100, మోడల్ ధర రూ.11,001 పలికింది. కాయలు 114 బస్తాలు రాగా వాటి కనిష్ట ధర రూ.10,500, గరిష్ట ధర రూ.11,100, మోడల్ ధర రూ.11,001 పలికింది.

కళ తప్పుతోంది..!

- కనుమరుగవుతున్న నాటక కళ
- పేద కళాకారులకు ఆదరణ కరువు
- రంగస్థలంపై పెదకూరపాడు కళాకారుల చెరగని ముద్ర
- స్త్రీ పాత్రల్లో రాణింపు..
- రేపు ప్రపంచ రంగస్థల దినోత్సవం

పెదకూరపాడు: హావభావాలతో, ఆహార్యంతో, అభినయంతో నవరసాలలు రంగరించి ప్రజలకు వినోదం పంచుతూ, సామాజిక మార్పునకు సైతం శ్రీకారం చుట్టే రంగస్థ కళ నేడు కనుమరుగవుతోంది. ప్రోత్సాహం కరువై... ఆదరణ లేక...అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలు లేక...ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ముందుకు రాక రంగస్థల కళ అంతరించే ప్రమాదం ఏర్పడింది. పెదకూరపాడుకు చెందిన పలువురు రంగస్థల నటులు తమకిచ్చిన పాత్రలకు ప్రాణం పోస్తూ, స్త్రీ పాత్రల్లో చక్కటి హావభావాలు పలికిస్తూ, తమ నటనా కౌశలంతో ప్రేక్షకులను రంగస్థలంవైపునకు నడిపిస్తున్నారు. ఈనెల 27న రంగస్థల దినోత్సవం సందర్భంగా కథనం.

కాకర్ల కళా నైపుణ్యం..

బీసీ బాలుర వసతి గృహంలో కమాటీగా పనిచేస్తున్న కాకర్ల పరమేశ్వరరావుకు చిన్నతనం నుంచే పౌరాణిక నాటికాలంటే ప్రాణం. ఉద్యోగం వచ్చినా.. ఖాళీ సమయాల్లో నాటకాల్లో నటిస్తూ, అందులో ప్రావీణ్యం సాధించారు. ఇప్పటివరకు సుమారు 500 నాటికలను ప్రదర్శించి అందరిచే శభాష్ అనిపించుకున్నారు. పరమేశ్వరరావు పలు నాటకాల్లో పోషించిన స్త్రీ పాత్రల తీరు అందరినీ మెప్పించాయి. ఎక్కువగా బ్రహ్మంగారి నాటకంలో మత్తి, పువ్వుల పున్నయ్య, లక్ష్మీ తిరుతమ్మ నాటకంలోని స్త్రీ పాత్రలను అవలీలగా పోషిస్తారు.



పువ్వుల పున్నయ్య నాటికలో స్త్రీ వేషంలో కళాకారుడు కాకర్ల (ఫైల్)

సామాజిక అంశాలతో చైతన్యం..

ప్రసిద్ధ రంగస్థల నటుడు బండారు పుల్లయ్య భాగవతార్ వద్ద కొంత కాలం శిష్యరికం చేసిన కాకర్ల సామాజిక అంశాలపై బాధ్యతతో తన నటన ద్వారా ప్రచారం చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలతో కలసి పువ్వుల పున్నయ్య నాటకాల ద్వారా ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధిపై కూడా పలు ప్రదర్శనలు నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గతంలో తాడికొండలో నిర్వహించిన కల్చరల్ ఈవెంట్‌లో పున్నయ్య ప్రాతను తొలిసారి ప్రదర్శించి ప్రేక్షకులను సమ్మోహితులను చేశారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పలు నాటకాలు ప్రదర్శించి, సత్కరాలు పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రదర్శనలు చేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..



ఒకప్పుడు కళాకారులు అంటే ఎంతో గౌరవం ఉండేది. ప్రస్తుతం రంగస్థల కళలు అంతరించిపోతున్నాయి. ప్రోత్సాహం కరువైంది. కళాకారులు తిండి లేక కూలి పనులకు వెళ్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు రంగస్థల కళాకారులను వినియోగించుకోవాలి.

– కాకర్ల పరమేశ్వరరావు, కళాకారుడు

కళాకారులకు పింఛన్లు ఇవ్వాలి..



కళాకారులను ప్రభుత్వాలు ఆదుకోవాలి. ప్రస్తుతం నాటకాలు లేక కూలి పనులు చేస్తున్నాం. అప్పటిలో రంగస్థంపై నాటికలు వేస్తుంటే జనం విశేషంగా ఆదరించేవారు. కళాకారులకు పింఛన్లు ఇచ్చి ఆదరించాలి.

–మనగోటి శ్రీనివాసరావు, కళాకారుడు

స్త్రీ ప్రాతలకు కేరాఫ్..

మండలంలోని 75 త్యాళ్ళూరు గ్రామానికి చెందిన మనగోటి శ్రీనివాసరావు, యన్నం నారాయణరెడ్డిలు కూడా స్త్రీ ప్రాతలు వేస్తూ తమదైన శైలిలో ప్రేక్షకులను మెప్పించారు. వీరిద్దరు లక్ష్మీ తిరుపతమ్మ నాటకంలో వెంగమాంబ, చంద్రమ్మ పాత్రలలను ఇప్పటివరకు 200 పైగా నాటకాల్లో పోషించారు.

సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేద్దాం

వర్సిటీ అనుబంధ కళాశాలల యాజమాన్య సంఘం



సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులు, ఫైనాన్స్ సెక్రటరీగా ఎన్నికైన ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: డిగ్రీ కళాశాలల సమస్యలను పరిష్కరించుకోవడంలో సమష్టిగా కృషి చేయాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు తీర్మానించాయి. రావిపాడురోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో మంగళవారం వర్సిటీ అనుబంధ కళాశాలల యాజమాన్య సంఘం సమావేశం నిర్వహించారు. కళాశాలలకు ఎదురవుతున్న సమస్యలను ఐకమత్యంగా ఎదుర్కోవాలని నిర్ణయించారు. ఈసందర్భంగా యాజమాన్యాల ప్రతినిధులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కళాశాలల ఖాతాల్లో ఫీజురీయింబర్స్‌మెంట్ నగదు వేయటంపై కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలల అఫిలియేషన్ గడువును 5 సంవత్సరాలకు ఒకేసారి ఇవ్వాలని, జీఓ 36ను రద్దు చేయాలని కోరారు. అలాగే 30 శాతం మేనేజ్‌మెంట్ సీట్ల కోటాను రద్దు చేసి అన్ని సీట్లు కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేయాలన్నారు. ఆయా సమస్యలను ప్రభుత్వం, వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించేలా అసోసియేషన్ కృషి చేయాలని తీర్మానించారు.

నూతన కార్యవర్గం..

వర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడిగా రాయల శ్రీనివాసరావు (వాగ్దేవి డిగ్రీ కళాశాల, నరసరావుపేట), ప్రధాన కార్యదర్శిగా ప్రమదా రాజశేఖర్ (మంగళగిరి), ఫైనాన్స్ సెక్రటరీగా మైనీడి శ్రీనివాసరావు (విక్టరీ డిగ్రీ కళాశాల, నరసరావుపేట), ఉపాధ్యక్షులుగా వై.వెంకట్రామయ్య (మాచర్ల), పి.సీతారామ్‌బాబు (వినుకొండ), జాయింట్ సెక్రటరీగా వీరవల్లి శ్రీనివాసరావు (సత్తెనపల్లి), కార్యవర్గ సభ్యులుగా గంట కిషోర్‌కుమార్ (గురజాల), చేబ్రోలు మహేష్ (చిలకలూరిపేట), బాడిశ మస్తాన్ (పిడుగురాళ్ల) ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం సంఘం ప్రతినిధులు రాంబాబు, పెద్దిరాజు, రాష్ట్ర జూనియర్ కళాశాలల సంఘం అధ్యక్షుడు వీవీ ప్రసాద్ వ్యవహరించారు. సమావేశంలో వర్సిటీ పరిధిలోని కళాశాలల యాజమాన్య ప్రతినిధులు హాజరయ్యారు.

జిల్లా సెషన్స్ న్యాయాధికారి సత్యశ్రీకి పీహెచ్‌డీ

నరసరావుపేట టౌన్: స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి నేతి సత్యశ్రీకి ఆంధ్ర విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టా అందించింది. న్యాయాధికారి ఎన్.సత్యశ్రీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం పర్యవేక్షణలో తన పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఎన్నికల్లో తప్పుడు సమాచారాన్ని బహిర్గతం చేయడం, ఎన్నికలలో ప్రచారాలు, సాంకేతిక యుగంలో చట్టపరమైన నైతిక సందిగ్ధతలు అనే అంశంపై పరిశోధన చేశారు. ప్రస్తుత ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ యుగంలో ఎన్నికల ప్రచారాలలో చోటు చేసుకుంటున్న అపసవ్యతలు, వాటిని శాస్త్రీయంగా సరిదిద్దుకోవడానికి తీసుకోవలసిన చర్యలు, మీడియా పాత్ర, వ్యక్తిగత స్వేచ్ఛ తదితర అంశాలను స్పృశిస్తూ ఈ పరిశోధన పూర్తి చేశారు.



ఏయూ వీసీ పీఎస్ రాజశేఖర్ చేతులమీదుగా పీహెచ్‌డీ స్వీకరిస్తున్న న్యాయాధికారి

ఈ సందర్భంగా సోమవారం విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీఎస్ రాజశేఖర్ చేతులమీదుగా న్యాయశాస్త్రంలో డాక్టరేట్ డిగ్రీని పొందుకున్నట్లు ఆమె మంగళవారం తెలిపారు.

అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపండి

సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయ్‌కుమార్

నరసరావుపేట: మాతా శిశు సంరక్షణలో గౌరవ వేతనం తీసుకుంటూ విశేష సేవలు అందిస్తున్న అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు తగదని సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞానకేంద్రంలో మంగళవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కేపీ మెటిల్డాదేవి అధ్యక్షత వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక సందర్భాలలో అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులకు పాల్పడుతుందని, ప్రస్తుతం రాజకీయ వేధింపులతో పాటు అధికారుల వేధింపులు కూడా తోడయ్యాయన్నారు. వీటికి నిదర్శనమే సత్తెనపల్లిలో అంగన్‌వాడీ జ్యోతి ఆత్మహత్యాయత్నం, నకరికల్లు మండలం పాపిశెట్టిపాలెంలో అంగన్‌వాడీ ఫాతిమా ఆత్మహత్యలన్నారు. ఆయా ఘటనలలో నిందితులపై ఇంతవరకు కేసులు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లీశ్వరి మాట్లాడుతూ ఒకవైపు వేధింపులు మరోవైపు యాప్‌లతో అంగన్‌వాడీలు పని ఒత్తిడికి గురవుతున్నారరన్నారు. సాంకేతిక సమస్యలతో మొబైల్ ఫోన్లు పనిచేయక అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరోవైపు అధికారులు యాప్‌లో పిల్లల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయకపోతే వేతనాల్లో కోత విధిస్తామంటూ బెదిరింపులకు పాల్పడడం తగదన్నారు. అదేవిధంగా 42 రోజుల పాటు చేసిన సమ్మె సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా హామీల అమలు డిమాండ్ల సాధనకు అవసరమైతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు ఎ.లక్ష్మి ప్రసన్న, నిర్మల, సాయి, మాధవి, పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటూరు విజయకుమార్

దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(గుంటూరు) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ పరీక్ష ఫలితాలను వర్సిటీ వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్ రావు మంగళవారం విడుదల చేశారు. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 31న తుది గడువుగా నిర్ణయించారు. అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, ర్యాంక్ పొందిన వారితోపాటు ఏపీ ఐసెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఈ కోర్సుల్లో అడ్మిషన్లను పొందవచ్చు అని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య దిట్టకవి రామచంద్రన్ లు తెలిపారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫలితాలు, ర్యాంక్ కార్డులను వర్సిటీ వెబ్సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూసీడీఈ.ఇన్ఫో నుంచి పొందవచ్చన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో వర్సిటీ ఓ ఎస్ డి ఆచార్య ఆర్ వి ఎస్ ఎస్ రవికుమార్, అసిస్టెంట్ రిజిస్టర్ కృష్ణవేణి, సూపరింటెండెంట్‌లు జవ్వాజి శ్రీనివాసరావు, నేలపాటి నాగేశ్వరరావు, వర్సిటీ సిబ్బంది రాధాకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, రామచంద్రన్ తదితరులు

వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

పలు సూచనలు చేసిన సహాయ కార్మిక శాఖ అధికారి

నరసరావుపేట: వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి ఆఫీసర్, సహాయ కార్మికశాఖ అధికారి జి.ధనలక్ష్మి కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలకు అనుగుణంగా కార్మికుల రక్షణకు యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కర్మాగారాలు, దుకాణాలు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధిహామీ కూలీలు, వలస కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే పలు సూచనలు చేశామన్నారు. పనిచేసే సమయం మార్చి పనిప్రాంతంలో చల్లని నీడ, నీటివసతి కల్పించాలని తెలిపారు. వైద్యసిబ్బందితో సమన్వయం చేసుకొని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులు సమకూర్చుకోవాలని, మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు పనిగంటల్లో మార్పు చేయాలని, డీ హైడ్రేషన్ నివారణా మార్గాలపై అవగాహన కల్పించాలని కోరారు.

అమరావతిలో మంత్రి నారాయణ పర్యటన



కార్యాలయాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

తాడికొండ: రాజధాని అమరావతి ప్రాంతంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మంగళవారం పర్యటించారు. రాయపూడి సమీపంలో నిర్మాణంలో ఉన్న కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయాలను పరిశీలించిన ఆయన అధికారులను అడిగి పలు వివరాలు తెలుసుకొని సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రూ.43 వేల కోట్లతో గత ప్రభుత్వంలో టెండర్లు పిలిచామని, అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆలిండియా సర్వీస్ అధికారుల భవనాలు దాదాపు పూర్తయ్యాయన్నారు. మొదట రాజధానిలో క్లీనింగ్ పనులు పూర్తయ్యాయని ఇప్పుడు సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ బంగ్లాలు పరిశీలించినట్లు పేర్కొన్నారు. 186 బంగ్లాలు, మంత్రులు, జడ్జిలు, కార్యదర్శులు ప్రధాన కార్యదర్శులకు వస్తున్నాయన్నారు. గెజిటెడ్ అధికారులకు 1440, ఎన్‌జీవోలకు 1995 నిర్మాణాలు వస్తున్నాయని, హైకోర్టు 16.85 లక్షల చదరపు అడుగులు వస్తుందని, అసెంబ్లీ 250 మీటర్ల ఎత్తులో అందుబాటులోకి రానుందన్నారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి రుణాలు తీసుకున్నామని, ల్యాండ్ వేల్యూ పెరిగిన తరువాత అప్పు తీరుస్తామని వెల్లడించారు.

మొండి బకాయిల రికవరీ వేగవంతం చేయాలి

స్త్రీనిధి జిల్లా ఏజీఎం చిన బుల్లెయ్య

ఈపూరు(శావల్యాపురం): స్త్రీనిధి మొండి బకాయిల వసూలు వేగవంతం చేయాలని జిల్లా స్త్రీనిధి ఏజీఎం రంతు చిన బుల్లెయ్య అన్నారు. మంగళవారం ఈపూరు మండలం వెలుగు కార్యాలయంలో స్త్రీనిధి రుణాల రికవరీ పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో స్త్రీనిధి మొండి బకాయిలు రూ.15 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రూ.5కోట్లు వసూలు చేశామన్నారు. ఈనెలాఖారులోగా పెండింగ్‌లో ఉన్న రుణాలను రికవరీ చేయాలన్నారు. రుణాలు సకాలంలో చెల్లిస్తే మహిళల జీవనోపాధుల పెంపుదలకు దోహదపడతాయన్నారు. బొల్లాపల్లి మండలం రూ.53 లక్షలు, ఈపూరు రూ.53లక్షలు, అమరావతి రూ.82లక్షలు, యడ్లపాడు రూ.79లక్షలు, గురజాల రూ.79 లక్షలు, నరసరావుపేట రూ.71లక్షలు, అచ్చంపేట రూ.69 లక్షలు, పిడుగురాళ్ళ రూ.47 లక్షలు, క్రోసూరు రూ.37 లక్షలు, దాచేపల్లి రూ.44లక్షలు, కారంపూడి మండలంలో రూ. 35 లక్షల మొండి బకాయిలు ఉన్నాయని మండలాల వారిగా ఉన్నతాధికారులు రీకవరీ టీం సభ్యులను ఏర్పాటు చేసి నూరుశాతం వసూలు చేయటానికి కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు.



వనికుంటలో పర్యటిస్తున్న జిల్లా ఏజీఎం చినబుల్లెయ్య

2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 24 వేల మంది మహిళా సభ్యులకు స్త్రీనిధి రుణాలు రూ.120 కోట్లు ఇవ్వటానికి లక్ష్యంగా ఏంచుకొనగా ఇప్పటి వరకు 5400 మంది మహిళలకు రూ.41 కోట్లు రుణాలను అందజేశామన్నారు. స్త్రీనిధి రుణాలు చెల్లింపులు సక్రమంగా లేకపోవటం వలన లక్ష్యాలను అధిగమించలేదన్నారు. అనంతరం ఈపూరు మండలం వనికుంట, బొమ్మరాజుపల్లి గ్రామాల్లో పర్యటించి గ్రామసంఘం సభ్యులతో మాట్లాడి స్త్రీనిధి రుణాలు వసూలు పురోగతిపై సమీక్షంచారు. ఆయనతో పాటు సీసీలు అబ్బూరి రామారావు, నరేష్, సీలార్‌బీ వీవోఏలు ఉన్నారు.

యార్డుకు 1,44,172 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు)ః గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,44,172 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,39,165 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 69,373 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

రైలు ఢీకొని కానిస్టేబుల్ మృతి



పెద్దనబోయిన రాఘవరెడ్డి(ఫైల్)

తెనాలిరూరల్: రైలు ఢీకొని ఏపీఎస్పీ బెటాలియన్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన తాడేపల్లి మండలం ఇప్పటం వద్ద చోటుచేసుకుంది. తెనాలి జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. మంగళగిరి ఆరో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న పెద్దనబోయన రాఘవరెడ్డి(46) తనతో కలసి డ్యూటీలో ఉన్న సహచరులకు వారి ఇళ్ల నుంచి మంగళవారం భోజన క్యారేజీలను తీసుకెళ్లాల్సి ఉంది. 11 గంటల ప్రాంతంలో సహచరులకు ఫోన్ చేసి భోజనాలు సిద్ధమయ్యాయో కనుక్కుంటే తీసుకొస్తానని చెప్పాడు. కొద్ది సేపటికే ఇప్పటం రైల్వే గేటు వద్ద పట్టాల వెంబడి మృతి చెంది పడి ఉన్నాడు. పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. రైలు ఢీకొట్టిందా లేక సడెన్‌గా రైలు రావడంతో పక్కకు జరిగే క్రమంలో కాలు జారి పడడంతో తల వెనుక భాగంలో గాయమై మృతి చెందాడా అన్న అంశాలు పోస్ట్‌మార్టమ్/దర్యాప్తులో తెలుస్తాయని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భభూర్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము

వైకుంఠపురము, తెనాలి పట్టణము మరియు మండలము, గుంటూరు జిల్లా. తెనాలి.

ఫోన్ : 9491000731

ఆర్.సి నెం.ఎ2/02/2024 | తేది.25.03.2025.

www.apeprocurement.gov.in

ఇ-టెండరు, సీల్డు టెండరు, బహిరంగ వేలము ప్రకటన

శ్రీ లక్ష్మి పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానమునకు రూ.5,16,01,774-00లు ఫిక్సుడు డిపాజిట్లు కలవు. కావున 2025-26 సం॥నకు దేవస్థానమునకు గల ఫిక్సుడు డిపాజిట్లను రెన్యువల్ చేయదలచినందున ఫిక్సుడు డిపాజిట్లకు 1 సంవత్సర కాలపరిమితికి ఇచ్చు వడ్డీ రేట్లను సీల్డు కొటేషన్లు దేవస్థానమునకు సమర్పించవలసినదిగా ఆహ్వానించటమైనది. ది.02.04.2025న పబ్లిక్ ఆక్షన్ కూడా నిర్వహించదలచినాము. బ్యాంకుల వారు తమ తమ వడ్డీరేట్ల వివరాలను కొటేషన్ రూపములో ది.01.04.2025 సా॥ గం॥ 05.00ల లోగా దేవస్థాన కార్యాలయము నందు ఏర్పాటు చేయు సీల్డు టెండరు బాక్సు నందు సమర్పించవలెను. ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయ పనివేళల యందు సంప్రదించగలరు.

శ్రీ స్వామివారి సేవలో... సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

తెనాలి పురపాలక సంఘము

ఆర్.ఒ.సి.నెం.87/2022/ఎ1 | తేది: 26-03-2025

బహిరంగ వేలం ప్రకటన

2025-2026 సంవత్సరమునకు అనగా ది.01-04-2025 నుండి ది.31-03-2026 వరకు తెనాలి పురపాలక సంఘమునకు చెందిన ఈ దిగువ తెలిపిన మార్కెట్లలో రుసుము వసూలు చేసుకొను హక్కుకై ది.27-03-2025 గురువారము ఉదయం గం.11:00 లకు మున్సిపల్ కార్యాలయములో కమీషనరు గారిచే గాని లేక వారి అనుమతి పొందిన అధికారిచేగాని బహిరంగ వేలము జరుపబడును. అవసరమైన యెడల తదుపరి దినముల యందు కూడా వేలం జరుపబడును.

వ. నెం.	గుత్త వివరములు	ముందుగా చెల్లించవలసిన ధరావత్తు (రూ.)	దాఖలు చేయవలసిన సాల్వెన్సీ మొత్తము (రూ.)
1	కూరగాయల మార్కెట్లు	1,00,000/-	10,00,000/-
2	పండ్ల మార్కెట్లు	10,000/-	2,00,000/-
3	చేపలు, కోళ్ళు, మాంసము మార్కెట్లు మరియు జంతు వధశాల	10,000/-	2,00,000/-
4	షాపు రూములు (గుత్త కాలపు పరిమితి 3 సంవత్సరముల కాలమునకు)	10,000/-	1,00,000/-
5	సత్యన్నారాయణ మున్సిపల్ లేక్ పార్క్		
	1. ఫుడ్ కోర్టు	10,000/-	1,00,000/-
	2. వెహికల్ పార్కింగ్	10,000/-	1,00,000/-
	3. క్యాంటిన్ పై అంతస్తు	10,000/-	1,00,000/-

ఇతర వివరములకు కార్యాలయ పనివేళలలో రెవిన్యూ విభాగము నందు సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- కమీషనరు, తెనాలి పురపాలక సంఘము